క్లుప్తంగా

అర్హులందరికీ 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

ఇల్లెందు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని, షరతులు విధించరాదని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు కోరారు. మంగళవారం కౌన్సిలర్లతో కలిసి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో సింగరేణి ఆధీనంలోని భూమి ఇటీవల క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అవకాశం ఇచ్చినప్పటికీ అసలైన నిరుపేదలకు న్యాయం జరగలేదన్నారు. అలాంటి వారికి షరతులు లేకుండా గృహలక్ష్మి వర్తింపజేయాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్, మంత్రులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంకెపాక నవీన్, కటకం పద్మావతి, యలమందల వాసు, ఎర్ర ఈశ్వర్, సూర్య నారాయణ పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ ఆపరేటర్ల నిరసన



నిరసన తెలుపుతున్న కంప్యూటర్ ఆపరేటర్లు

చుంచుపల్లి: తెలంగాణ ఈ-పంచాయతీ టెక్నికల్ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న శాంతియుత సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నినాదాలు చేస్తూ కలెక్టరేట్ గేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేసి ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విక్రమ్, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ జిల్లా అధ్యక్షుడు కిషోర్, జనరల్ సెక్రటరీ క్రాంతి, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, అరవింద్, రవి, చంద్రకళ, అనిషా, సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలను వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ చందర్

ఇల్లెందురూరల్: పోలీసు శాఖ ద్వారా అందే సేవలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని మండలంలోని సుభాష్‌నగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, హెడ్ కానిస్టేబుల్ చందర్ సూచించారు. పాఠశాల ఆవరణలో 100, హెల్ప్‌లైన్‌లపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా ఆపద ఎదురైనప్పుడు ఉచితంగా 100కు కాల్ చేసి చెప్పవచ్చని తెలిపారు. జరిగిన ఘటనపై భయంతో మనసులో పెట్టుకుంటే మరొకరికి అటువంటి ఇబ్బందే ఎదురు చూడాలని చెప్పారు. పోలీసుల పట్ల భయాన్ని వీడి స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాసరావు, ఎల్లయ్య, హోంగార్డు పద్మ తదితరులు పాల్గొన్నారు.

20 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

కొత్తగూడెంఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురు చూస్తున్న పీఆర్సీ కమిటీని ప్రభుత్వం నియమించడం హర్షణీయం, కానీ మధ్యంతర భృతిని కేవలం 5 శాతం ప్రకటించడం శోచనీయమని టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని కోరారు. జీఓను సవరించి 20 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని లేదంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

ఇల్లెందు: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురు చూస్తున్న పీఆర్సీ కమిటీని ప్రభుత్వం నియమించటం హర్షణీయమని, కానీ మధ్యంతర భృతిని 5శాతం ప్రకటించటం తగదని, తక్షణం 20 శాతం ప్రకటించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం (టీడబ్ల్యూటీయూ)-టీఎస్ వైస్ ప్రెసిడెంట్ మాలోతు ప్రతాప్‌సింగ్ నాయక్ కోరారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు.

అమ్మవారి భక్తుల్లో ఆనందం

- అందుబాటులోకి రానున్న రెండు ఏసీ ఫంక్షన్ హాళ్లు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే వనమా



పెద్దమ్మ గుడి వద్ద కొత్తగా నిర్మించిన ఫంక్షన్‌హాళ్లు

పాల్వంచరూరల్: ఎప్పుడెప్పుడా అని భక్తులు ఎదురు చూస్తున్న రెండు ఫంక్షన్ హాళ్ల నిర్మాణం మూడు సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు పూర్తిచేశారు. నేడు ఎమ్మెల్యే వనమా చేతులమీదుగా ప్రారంభించనున్నారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద రూ.3.90 కోట్ల వ్యయం చేసి రెండు ఏసీ ఫంక్షన్ హాళ్లను ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇందులో రూ.2.21కోట్ల వ్యయంతో 700 మంది సామర్థ్యం కలిగిన పెద్ద ఫంక్షన్ హాల్, రూ.1.69 కోట్ల వ్యయంతో 500 మంది సామర్థ్యం మరో ఫంక్షన్ హాల్‌ను జూన్ 10, 2020న నిర్మాణం పనులు ప్రారంభించారు. మూడు సంవత్సరాల తర్వాత బుధవారం ప్రారంభోత్సవానికి ముస్తాబు చేశారు.

ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు వసూళ్లు...

అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తులు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు వెళితే అద్దెలు అధికంగా వసూళ్లు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెద్దమ్మతల్లిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఫంక్షన్ హాల్ కావాలంటే నెలరోజుల ముందు బుక్ చేసుకుంటే తప్ప, దొరకని పరిస్థితి. ఆలయానికి చెందిన ఫంక్షన్ హాల్స్ అయితే తక్కువ ధరలకు లభిస్తాయని భక్తులు ఆశిస్తున్నారు.

సంతోషంగా ఉంది..



పెద్దమ్మతల్లి అమ్మవారి సన్నిధిలో శుభకార్యం చేసుకోవాలంటే ఫంక్షన్ హాల్స్ కొరతతో పాటు ఉన్న ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌లో అధిక అద్దెలు తీసుకోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కొత్తగా నిర్మించినవి దేవస్థానం ఆధీనంలో తక్కువ అద్దెలకు ఇస్తే బాగుటుంది.

– కల్లోజు మానస, కొత్తగూడెం

భక్తులపై భారం తగ్గుతుంది



పెద్దమ్మతల్లి గుడి వద్ద సామన్య, మధ్యతరగతి భక్తులు ఎదైనా ఫంక్షన్ చేయాలంటే ప్రవేట్ ఫంక్షన్ హాల్స్‌కు వెళ్లితే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆలయానికి చెందిన ఫంక్షన్ హాల్స్ అందుబాటులోకి వస్తే భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఫంక్షన్ హాళ్ల కొరత తీరుతుంది.

– వీణ, హైదరాబాద్

కాంట్రాక్టుకు ఇస్తాం..



పెద్దమ్మ గుడి వద్ద ప్రారంభించనున్న రెండు ఫంక్షన్ హాళ్లను రూ.5 లక్షల డిపాజిట్‌తో మూడు సంవత్సరాల కాంట్రాక్టుకు అప్పగిస్తాం. దేవస్థానంలో సిబ్బంది లేని కారణంగా ఎండోమెంట్ అధికారుల ఆదేశాల మేరకు స్థానికంగా ధరలను పరిగణనలోకి తీసుకుని అద్దె నిర్ణయించడం జరుగుతుంది.

– ఎస్.రజనీకుమారి ఈఓ, పెద్దమ్మగుడి

ఐఆర్ జీఓను సవరించండి..



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం జీఓ 159 మరియు 133 ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు రెండో పీఆర్సీలో 5 శాతం ఐఆర్ ఇస్తున్నట్టుగా ప్రకటించడం వారిని అవమానించడమే నని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల కోయగూడెంలో ఉపాధ్యాయులు మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గత పీఆర్సీ సంబంధించిన 15 వాయిదాల ఏరియర్లను నేటికీ జమ చేయలేదన్నారు. మూడు పెండింగ్ డీఏలను విడుదల చేయలేదని, రాష్ట్రంలో అన్ని రకాల ధరలు మండిపోతున్న సందర్భంలో, ద్రవ్యోల్బణం, ధరల సూచికను పరిగణలోకి తీసుకొని కనీసం 18 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ జీఓను సవరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.అమర్ సింగ్, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు కే.లాలయ్య, టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఈ.ముత్తయ్య, మండల కార్యదర్శి ఎం.శారద ఉపాధ్యాయులు బి.బాలరాజు, బి.సైదులు, పి.పాపారావు, బి.కస్నానాయక్, బి.నాగేశ్వరరావు, సీహెచ్.వీరన్న, సీహెచ్.జానకి, కె.శ్రీదేవి, జి.రవి కుమార్, జి.భద్రు, బి.వీరయ్య పాల్గొన్నారు.

ఓసీ నిర్వాసితులుగా గుర్తించాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న భూపేష్‌నగర్ ప్రజలు

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో చేపట్టనున్న ఓసీ పరిధిలో నిర్వాసితులుగా తమను కూడా గుర్తించాలని మండలంలోని విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీ భూపేష్‌నగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్ ఎదుట ధర్నా చేసి తమ ఆకాంక్షను, ఆవేదనను తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా వివరించారు. మాట్లాడుతూ.. సింగరేణి చేపడుతున్న జేకే ఓసీ భూపేష్‌నగర్‌కు కేవలం 50 మీటర్ల దూరంలో ఉంటుందన్నారు. గతంలో 24 ఇంక్లైన్ భూగర్భ గని మూతపడిన నాటి నుంచి ఈ ప్రాంతాన్ని విస్మరించిన సింగరేణి నేడు ఓసీ పేరుతో మరోసారి ప్రజల ముందుకొచ్చి సౌకర్యాలు మెరుగు పరుస్తామని కల్లబొల్లి మాటలతో ఓసీకి సహకరించాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే పలుమార్లు ఈప్రాంతంలో భూమి కుంగిపోవడం, భూగర్భం నుంచి విష వాయువులు వెలువడటం వంటి సంఘటనలు జరిగాయని గుర్తుచేశారు. విజయలక్ష్మీనగర్ పూర్తిగా, తిలక్‌నగర్‌లో పాక్షికంగా నిర్వాసిత ప్రాంతంగా గుర్తించిన అధికారులు తమ ప్రాంతాన్ని కూడా నిర్వాసిత జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఓసీ పనులు జరగనివ్వబోమని హెచ్చరించారు.

కార్యక్రమంలో స్థానికులు చందావత్ రమేష్‌బాబు, విజయ్, వంశీ, రమేష్, శ్రీను, రాందాస్, సురేష్, నాని, రాము, సాంబయ్య, నర్సయ్య, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన



సూపర్‌బజార్(కొత్తగూడెం): వంటావార్పుతో నిరసన తెలుపుతున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. సమ్మె చేపట్టి 15 రోజులైనా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి విమర్శించారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు ఈసం శెట్టి పద్మజ, కరిష రత్నకుమారి, మేదిని లక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, నాయకులు ప్రభావతి, మంగ, కృష్ణవేణి, రమాదేవి, స్వప్న, బేగం, వహేద, బుజ్జమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

టేకులపల్లి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి మధ్యాహ్న భోజన వర్కర్లు నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంగళవారానికి ఆరో రోజుకు చేరుకుంది. వారం రోజులవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ఈసం రాణి, నాగలక్ష్మి, రాంబాయి, జయమ్మ, సమ్మక్క, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోకన్వీనర్, ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు, నాయకులు చింతల మోహన్ రావు, మెంతిన ప్రభాకర్ సంఘీభావం తెలిపారు.

పోడు రైతులకూ రుణాలు ఇవ్వండి



యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న పోడు రైతులు

ఇల్లెందు: చీమలపాడు ఏరియాలోని ఏడు గ్రామ పంచాయతీలలో పోడు పట్టాలున్న రైతులకు రుణాలు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపిస్తూ సీపీఎం గిరిజన సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. మంగళవారం ఇల్లెందులోని యూనియన్ బ్యాంక్ ఎదుట రైతులు మూడు గంటల పాటు ఆందోళన చేపట్టారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసిన పోడు పట్టా హక్కు పత్రాలున్నా రుణాలు ఇవ్వవం లేదని సీపీఎం వైరా నియోజకవర్గం ఇన్‌చార్జ్ భూక్యా వీరభద్రం ఆరోపించారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆందోళనలో సీపీఎం, గిరిజన సంఘం నేతలు కె. నాగేశ్వరరావు, నరేంద్ర, రామారావు, సైదులు, భావ్‌సింగ్, రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారు 2023–24 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ పొందుటకు ఈ నెల 13 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8008403522 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..

సుజాతనగర్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ ఒంగోలు జిల్లాకు చెందిన సుభాష్ చంద్రబోస్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం సుజాతనగర్ మండల కేంద్రానికి చేరుకుంది. చంద్రబోస్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు 50 వేల కిలోమీటర్లు లక్ష్యంగా గత నెల 2 నుంచి సైకిల్ యాత్ర చేపట్టి ఇప్పటి వరకు 2,500 కిలోమీటర్లు ప్రయాణించినట్లు పేర్కొన్నారు. సుజాతనగర్‌లో ఆగిన సుభాష్‌కు వార్డు సభ్యులు జయరామిరెడ్డి, పలువురు పండ్లు అందజేశారు. యాత్రలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులను కలుసుకుని రాజ్యాంగం ఆవశ్యకతను వివరిస్తున్నట్లు చెప్పారు.

దసరా ఇన్సెంటివ్ ఇవ్వండి

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్ కార్మికులకు దసరా పండుగకు 15 రోజుల ఇన్సెంటివ్, జూలై నుంచి రావాల్సిన కరువు భత్యం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్142) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. మంగళవారం జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా విడుదల చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, ఎర్రగడ్డ ప్రసాద్, బొల్లేపల్లి నాగేశ్వరరావు, ప్రకాశ్, వేణు, కోటేశ్వర రావు, జరీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కామేష్

కొత్తగూడెంఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే వారికి వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ టికెట్ ఇస్తుందని పార్టీ రాజ్యసభ సభ్యులు, నేషనల్ కోఆర్డినేటర్ రంజీ గౌతమ్, రాష్ట్ర చీఫ్ డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాదులో వారు అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. ఈ మేరకు కొత్తగూడెం అభ్యర్థిగా కామేష్‌ను ప్రకటించారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించండి

జూలూరుపాడు: ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్న దృష్ట్యా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని కోరుతూ భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ బానోత్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు టైఫాయిడ్, విషజ్వరాల బారిన పడుతున్నారని, జ్వరాల నియంత్రణకు వారంలో రెండుసార్లు వైద్యశిబిరాలు నిర్వహించి, మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. బానోత్ రాంబాబు, లకావత్ గణేష్, దేవీలాల్, భూక్యా శ్రీను, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం



ప్రచారం చేస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మంగళవారం బాలాజీనగర్ గ్రామపంచాయతీలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించి, కరపత్రాలను అందజేశారు. మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల ఆకాంక్ష నేటికీ నెరవేరలేదన్నారు. మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ ఏకపక్ష పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దరఖాస్తు చేస్తున్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించామని, నేడు ఎమ్మెల్యేలు దరఖాస్తులు స్వీకరించడం, వారే అర్హులను ఎంపిక చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా జరుగుతున్న పరిణామాలను ప్రజలు గుర్తించి కాంగ్రెస్‌ను గెలిపించి సంక్షేమ ఫలాలను అందుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.2,500, రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక చేయూత, గ్యాస్ సిలిండర్ రూ.500, లీటరు పెట్రోల్ రూ.50 వాటితోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పులిసైదులు, యదళ్లపల్లి అనసూర్య, పాయం స్వాతి, కల్తి పద్మ, పాయం లలిత, తాటి చుక్కమ్మ, మండల రాముమహేష్, మున్నాభాయ్, ఆంజనేయులు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం..

జూలూరుపాడు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ బీఎల్‌ఓలతో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దొబ్బల సౌజన్య, బానోత్ బాలాజీ నాయక్, మాళోత్ రాందాస్ నాయక్, లేళ్ల వెంకటరెడ్డి, మాళోత్ మంగీలాల్ నాయక్, వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సింగరేణిలో 'స్వచ్ఛత' క్యాంపెయిన్



మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో మంగళవారం స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్‌ను ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజు ప్రారంభించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో అక్టోబర్ 1 నుంచి 31 వరకు పనిస్థలాల్లో పరిశుభ్రత, కార్యాలయాలు, కాలనీలను సుందరీకరణ మొదలైన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ స్వచ్ఛత కోసం గంట సమయం కేటాయించి పరిసరాలను పరిశుభ్రంగా చేసుకోవాలన్నారు. గాంధీజీ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతిపిత స్ఫూర్తితో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ఏరియా ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఆర్‌సీహెచ్‌పీ ఎస్ఈ కరీముల్లా, విశ్వేశ్వరరావు, ఎస్ఈ ఆజ్మీర శ్రీనివాస్, జి.రాజేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు ఎండీ గౌస్, పూర్ణచందర్‌రావు, ఆఫీసు సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించండి



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: రైతుల మరణానికి కారణమైన అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖీంపూర్ ప్రాంతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు రైతు ర్యాలీపై తన కాన్వాయ్‌తో తొక్కించుకొని వెళ్లడంతో ఐదుగురు రైతులతోపాటు, ఓ పత్రికా విలేకరి మృతి చెందాడన్నారు. ఈ దుర్ఘటనకు కారణమైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతోపాటు, రైతు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, చింతా స్వరాజ్‌రావు, వల్లమల్ల చందర్‌రావు, ఏదులాపురం గోపాల్‌రావు, యల్లంకి మధు, గార్లపాటి వెంకటి, గార్లపాటి వీరభద్రం, ఎస్కే చాంద్‌పాషా, ఎం.కృష్ణయ్య, ఊడల వెంకటేశ్వర్లు, గార్లపాటి పవన్‌కుమార్, జగదీష్, అభిమిత్ర, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను వీడాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎంఎస్‌పీ చట్టం చేయాలని, లఖీంపూర్ కేరి ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని అఖిలభారత రైతు సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఇల్లెందులో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. నేతలు చంద్ర అరుణ, ఎస్‌పీ నబీ, దేవరకొండ శంకర్, డి.ప్రసాద్, మోకాళ్ల రమేష్ మాట్లాడుతూ.. రైతులు సాగించిన చారిత్రాత్మక పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. కుట్ర పూరితంగా మళ్లీ అవే చట్టాలను అమలులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా మరోమారు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. లఖీంపూర్ ఖేరీలో వాహనాలతో రైతులను తొక్కించిన సంఘటనలో మంత్రిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ఈ ఆందోళనలో రైతు సంఘాల నాయకులు నాయిని రాజు, యాకుబ్‌షావలీ, బోసు, తుపాకుల నాగేశ్వరరావు, గుర్రం యాదగిరి, కొక్కు సారంగపాణి, రామ్‌సింగ్, సూర్నపాక నాగేశ్వరరావు, నరాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె



ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఇల్లెందు: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు ఆందోళనను ఉధృతం చేశారు. మంగళవారం ఇల్లెందులో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, జాబ్ చార్ట్ విడుదల చేయాలని, 32 రకాల రిజిస్టర్లను ప్రభుత్వం సరఫరా చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలని, ఐడీ కార్డులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

టేకులపల్లి: 23 రోజులుగా టేకులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ మరియు హెల్పర్స్, మినీ అంగన్‌వాడీ టీచర్ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్‌గా పర్మనెంట్ చేయాలని, టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని మరియు హెల్పర్లకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.ఇందిర, కొండపల్లి శకుంతల, వై.పద్మావతి, వి.సంధ్యారాణి, ఎన్.విజయలక్ష్మి, ఎం.నాగమణి, టి.వరమ్మ, వి.రాజేశ్వరి, కల్తీ భద్రమ్మ, కే.రాజేశ్వరి, ఐ.రాధ, జి.పద్మ, సుగుణ, సునీత చాంది తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: ఆశా కార్యకర్తలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఏవీ.అప్పారావు, దొడ్డా రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటిని సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీరన్న, వెంకటరమణ, మణీల, జయ, ఉషా, యశోద, మరియా తదితరులు పాల్గొన్నారు.